www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily | శుక్రవారం 4, సెప్టెంబర్, 2026

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే

# ప్రజా ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్రవ్యాప్తంగా భూ రీ--సర్వేను వేగవంతం చేయాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి.. అలసత్వం వహించే అధికారులను ఉపేక్షించేది లేదు




భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 3 (భద్రాద్రి న్యూస్): రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూయజమానికి చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం భద్రాద్రి ఐడీఓసీ కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని రెవెన్యూ, భూ రీ-సర్వే, రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సీసీఎల్ఏ, రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి (రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు) రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి నిర్వహించిన ఈ సమావేశంలో భూ రీ-సర్వే పురోగతి, నాన్-కెడస్ట్రల్, కెడస్ట్రల్ గ్రామాల్లో సర్వే పనులు, లైసెన్స్‌డ్ సర్వేయర్ల పనితీరు, 22-ఏ భూములు, సాదా బైనామాలు, అటవీ-రెవెన్యూ భూముల సరిహద్దు వివాదాలు, భూ భారతి చట్టం, నూతన రిజిస్ట్రేషన్ కార్యాలయాల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, రెండో విడత ఇళ్ల మంజూరు, ఉచిత ఇసుక సరఫరా తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.



2వ పేజీలో...

## విద్యార్థుల భవిష్యత్తును డ్రగ్స్‌తో నాశనం చేసుకోవద్దు

సరదా కోసం మాదకద్రవ్యాలు వాడితే జీవితాన్నే కోల్పోయే ప్రమాదం

ఘనంగా కేఎండీసీ ఫ్రెషర్స్ డే.. ప్రతి విద్యార్థి డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలి: ఎక్సైజ్ డీసీ సోమిరెడ్డి



3లో

## ఉత్పత్తి కంటే ఉద్యోగుల భద్రతే ప్రధానం

ప్రమాదరహిత సింగరేణి కోసం అన్ని చర్యలు.. ఆధునిక సాంకేతికతతో రక్షణకు పెద్దపీట 50వ త్రైపాక్షిక భద్రతా సమీక్షలో సీఎండీ డా. బుద్ధప్రకాష్ జ్యోతి

**కొత్తగూడెం సింగరేణి/ హైదరాబాద్, సెప్టెంబర్ 3 (భద్రాద్రి న్యూస్):** సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి కంటే ఉద్యోగుల భద్రతకే అధిక ప్రాధాన్యత ఇస్తామని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి స్పష్టం చేశారు. ప్రమాదరహిత సింగరేణి లక్ష్యంగా...



2లో

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం






**మొదటి పేజీ తరువాయి**

### ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు

భూభారతి చట్టం ద్వారా సామాన్య ప్రజలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి తెలిపారు. తహసీల్దార్లు, ఆర్డీవోలు, ఇతర రెవెన్యూ అధికారులు వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి అర్హులైన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు, రైతుల కోసమే భూభారతి చట్టాన్ని రూపొందించామని, అధికారుల సౌలభ్యం కోసం కాదని స్పష్టం చేశారు. అలసత్వం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత కొన్ని నెలలుగా కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.

### విధులకు హాజరుకాని సర్వేయర్లపై చర్యలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ--సర్వేలో లైసెన్స్‌డ్ సర్వేయర్లు తప్పనిసరిగా పాల్గొనాలని మంత్రి స్పష్టం చేశారు. రీ--సర్వే విధులకు హాజరుకాకుండా కేవలం ప్రైవేట్ సర్వేలకు పరిమితమయ్యే సర్వేయర్లకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్వే పనులకు అవసరమైన శిక్షణ పొందిన సిబ్బందిని తగిన సంఖ్యలో సిద్ధం చేయడంతో పాటు ప్రత్యామ్నాయ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కలెక్టర్లు, అదనపు కలెక్టర్లను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే పనులను పర్యవేక్షించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సర్వేను వేగవంతం చేయాలని సూచించారు.

### అటవీ--రెవెన్యూ భూముల వివాదాలకు శాశ్వత పరిష్కారం

సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దు వివాదాలను శాశ్వతంగా పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. కలెక్టర్లు, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా సమావేశమై శాస్త్రీయ పద్ధతుల్లో భూముల కొలతలు చేపట్టి సరిహద్దులను నిర్ధారించాలని సూచించారు. గతంలో పోడు భూములకు పట్టాలు పొందిన రైతులు బోర్లు, విద్యుత్ కనెక్షన్లు తదితర సౌకర్యాలు పొందే సమయంలో ఎలాంటి ఇబ్బందులు, వేధింపులు ఎదుర్కోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

మొదటి విడతలో ఎల్--1 కేటగిరీలో ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను తక్షణమే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పనులు ప్రారంభం కాని ఇళ్లను రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో చేర్చాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రవాణాతో కలిపి సిమెంట్ బస్తా రూ.230కు అందుబాటులో ఉందని, లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని అధికారులను కోరారు. జనగామ జిల్లా కలెక్టర్ రూపొందించిన యాప్‌ను అన్ని జిల్లాల కలెక్టర్లు అమలు చేయాలని సూచించారు.

### ఇళ్ల మంజూరులో అక్రమాలపై కఠిన చర్యలు

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, మంజూరు ప్రక్రియలో అక్రమాలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పూర్తి పారదర్శకత పాటించాలని, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

### అధికారుల పనితీరులో మార్పు రావాలి

నిబంధనలకు విరుద్ధంగా పనిచేసే అధికారులను ఉపేక్షించేది లేదని మంత్రి పొంగులేటి హెచ్చరించారు. ప్రజల సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని, దరఖాస్తు చేసుకునే ప్రతి వ్యక్తిని గౌరవంగా చూడాలని సూచించారు.భూ సర్వే, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలులో అవినీతి, అక్రమాలు, నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, మాలోత్ రాందాస్ నాయక్, కోరం కనకయ్య, డాక్టర్ మట్టా రాగమయి, జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్లు దివాకర్, అంకిత్, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, శ్రీనివాసరావు, డాక్టర్ శ్రీజ, విద్యా చందన, భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్, డీఎఫ్ఓ విక్రమ్ సింగ్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ కుమార్‌తో పాటు రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్, సర్వే, ఫారెస్ట్ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్పత్తి కంటే ఉద్యోగుల భద్రతే ప్రధానం




అన్ని రకాల భద్రతా చర్యలు చేపడుతున్నామని, కార్మిక సంఘాలు చేస్తున్న సూచనలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జరిగిన 50వ త్రైపాక్షిక భద్రతా సమీక్షా సమావేశంలో సీఎండీ మాట్లాడారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీజీఎంఎస్) అధికారులు, సింగరేణి అధికారులు, గుర్తింపు పొందిన, ప్రాతినిధ్య కార్మిక సంఘాల నాయకులు, యాజమాన్య ప్రతినిధులు సమావేశంలో పాల్గొని గనుల్లో భద్రతా చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు.

### ఆధునిక సాంకేతికతపై దృష్టి

ప్రమాదాల నివారణకు ప్రస్తుతం అమలు చేస్తున్న చర్యలు ఎంతవరకు ఫలితాలిస్తున్నాయి, గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం అవుతున్నాయా, ప్రమాదరహిత మైనింగ్ కోసం అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా వినియోగించుకోవాలనే అంశాలను పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని సీఎండీ తెలిపారు. కార్మిక సంఘాల నాయకులు చేసిన సూచనలపై కూడా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### ప్రాణాపాయ ప్రమాదాలు తగ్గడం అభినందనీయం

డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ డాక్టర్ సగేష్ కుమార్ మాట్లాడుతూ సమావేశంలో కార్మిక సంఘాలు అనేక విలువైన సూచనలు చేశాయని తెలిపారు. భద్రత విషయంలో సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాలు నిబద్ధతతో పనిచేయడం అభినందనీయమన్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది ప్రాణాపాయ ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గడం సంతోషకరమన్నారు. ఓపెన్‌కాస్ట్ గనుల్లో సింగరేణి ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులు కూడా ఒకే చోట బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదు చేసే విధానాన్ని తక్షణమే అమలు చేయాలని సూచించారు. ఉద్యోగుల భద్రత కోసం అవసరమైన శిక్షణ అందించేందుకు డీజీఎంఎస్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

### సిబ్బంది కొరతను తీర్చాలి

సమావేశంలో కార్మిక సంఘాల ప్రతినిధులు గనుల్లో భద్రత, ఆరోగ్యం, వైద్య సేవల మెరుగుదలకు పలు సూచనలు చేశారు. సిబ్బంది కొరతను తగ్గించాలని, ఆధునిక వైద్య సేవలు అందించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు కూడా సమగ్ర భద్రతా శిక్షణ ఇవ్వాలని కోరారు. అదేవిధంగా నాణ్యమైన భద్రతా బూట్లు సరఫరా చేయడం, గనుల్లో అవసరమైన సూపర్‌వైజర్లు, సిబ్బంది, అధికారులను నియమించడం, అవసరమైన స్పేర్ పార్ట్స్‌ను అందుబాటులో ఉంచడం వంటి అంశాలను యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై తగిన చర్యలు తీసుకుంటామని సింగరేణి ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు.

### మృత కార్మికులకు సంతాపం

సమావేశానికి జనరల్ మేనేజర్ (సేఫ్టీ) సాయిబాబు స్వాగతం పలికారు. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికులకు సమావేశం ముందుగా సంతాపం తెలిపింది. అనంతరం గత ఏడాది జరిగిన త్రైపాక్షిక భద్రతా సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సమావేశం సుహృద్భావ వాతావరణంలో కొనసాగింది. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, కార్యదర్శి రాజ్‌కుమార్, ప్రాతినిధ్య కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎస్. నరసింహారెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహులు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, ఎం. తిరుమలరావు, జనరల్ మేనేజర్లు, అన్ని ఏరియాల అధికారులు, డీజీఎంఎస్ డైరెక్టర్స్ ఆఫ్ మైన్ సేఫ్టీ డాక్టర్ సగేష్ కుమార్, డాక్టర్ ఐ. సత్యనారాయణ, రాజ్‌కుమార్, కె. మహేశ్వరరెడ్డి, పంకజ్ కుమార్ జైన్, డిప్యూటీ డైరెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తును డ్రగ్స్‌తో నాశనం చేసుకోవద్దు










**ఖమ్మం ప్రతినిధి , సెప్టెంబర్ 3 (భద్రాద్రి న్యూస్):**
సమాజంలో మాదకద్రవ్యాలు సాధారణ జీవితంలోకి ప్రవేశించడం ఆందోళనకర పరిణామమని, వాటి నిర్మూలనకు ప్రతి విద్యార్థి తనవంతు సహకారం అందించాలని ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థుల ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సోమిరెడ్డి మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్థులు మాదకద్రవ్యాలకు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సరదా కోసం డ్రగ్స్ వినియోగిస్తే చివరకు జీవితాన్నే కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోకుండా విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు.

**డిగ్రీ నుంచే భవిష్యత్తుకు బాట**

ఖమ్మం సీఐబీ బాలకృష్ణ మాట్లాడుతూ డిగ్రీ స్థాయి నుంచే విద్యార్థులు తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు. ప్రస్తుత కాలంలో డిగ్రీ విద్యకు ఆదరణ పెరుగుతోందని, విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్ట్ బి. ప్రసేన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించి మరింతగా పెంపొందించుకోవాలని సూచించారు. విద్యతో పాటు సృజనాత్మక ఆలోచనలు, ప్రతిభను అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు.

ఖమ్మం ఈగల్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ స్థాయిలోనే చాలామంది విద్యార్థులు వ్యసనాలకు బానిసలవుతున్నారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై అవగాహనతో నిఘా ఉంచి వ్యసనాల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం అనారోగ్యానికి మాత్రమే కాకుండా మంచి జీవితాన్ని కోల్పోయేలా చేస్తుందని హెచ్చరించారు.

**లక్ష్య సాధనకు ప్రణాళిక అవసరం**

కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కోటా అప్పిరెడ్డి మాట్లాడుతూ మూడు దశాబ్దాలకు పైగా తమ విద్యాసంస్థ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తోందన్నారు. కళాశాల నుంచి వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగిన పూర్వ విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకొని ప్రస్తుత విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు.

కొత్తగా కళాశాలలో చేరిన విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటి సాధనకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి. రమణారావు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉయిక శిరీష కుటుంబానికి కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి!






**హత్య చేసిన నరహంతకుడికి జీవితకాలం శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలి**

**ఆదివాసీ మహిళల రక్షణపై ప్రభుత్వం తక్షణమే కఠిన నిర్ణయాలు తీసుకోవాలి: బీఎస్పీ**

**చర్ల, సెప్టెంబర్ 3: భద్రాద్రి న్యూస్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఆదివాసీ యువతి ఉయిక శిరీషను హత్య చేసిన నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి, చట్టపరంగా కఠినంగా శిక్షించాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) డిమాండ్ చేసింది. శిరీష కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో పాటు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరింది. చర్ల మండల కేంద్రంలో బీఎస్పీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు యాసం సిద్దార్థ పూలే మాట్లాడుతూ.. ఆదివాసీ యువతి ఉయిక శిరీష హత్య ఘటన తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైతే భవిష్యత్‌లో మరిన్ని దారుణ ఘటనలకు ఆస్కారం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. శిరీషను హత్య చేసిన నిందితుడిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టకుండా వెంటనే అరెస్ట్ చేసి, కేసును వేగంగా దర్యాప్తు చేసి కఠినమైన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల రక్షణకు ఉద్దేశించిన చట్టాలను మరింత బలోపేతం చేయాలని, ముఖ్యంగా ఆదివాసీ మహిళలకు సంపూర్ణ రక్షణ కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. “ఆదివాసీ బిడ్డ ప్రాణానికి విలువ లేదా?” అని ప్రశ్నించిన బీఎస్పీ నేతలు.. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. శిరీష కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, తక్షణమే రూ.కోటి ఎక్స్‌గ్రేషియా, కుటుంబ సభ్యుడికి ప్రభుత్వ ఉద్యోగం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

**న్యాయం జరిగే వరకు పోరాటం**

ఆదివాసీ మహిళలపై దాడులు, వేధింపులు, హత్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకులు కోరారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఈసీ మెంబర్ వీసంపల్లి నర్సింహారావు, భద్రాచలం నియోజకవర్గ అధ్యక్షులు చెన్నం మోహన్ రావు, మండల అధ్యక్షులు పాయల మోహన్ రావు, కాకా నరసయ్య, దుర్వా నరసింహారావు, కారం జనార్ధన్, జోగయ్య, సోయం మంగతాయి, పాయల ప్రమీల, కారం వెంకటలక్ష్మి, మొడెం రాములు, కాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెజొనెన్స్ ఇన్ఫో పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు.. కృష్ణుడి బాల్య లీలలపై అవగాహన**




**ఖమ్మం, సెప్టెంబర్ 3 (భద్రాద్రి న్యూస్):**
విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఖమ్మంలోని రెజొనెన్స్ ఇన్ఫో స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొని పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు.

ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ.. మాతృభాషతో పాటు విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత పాఠశాలలపై ఉందన్నారు. శ్రీకృష్ణుడి బాల్య జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. చిన్నారులు శ్రీకృష్ణుడి వేషధారణలో ఆకట్టుకున్నారు.

శ్రీకృష్ణుడి జీవితంలోని విలువలు, ధర్మం, నిజాయితీ, ధైర్యం వంటి అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. కృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు ప్రదర్శించిన కృష్ణుడి బాల్య లీలలు, గోపికల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

డైరెక్టర్ గీలిమ మాట్లాడుతూ... కృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు విద్యార్థుల్లో సంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందించాయని అన్నారు. డైరెక్టర్ శ్రీధర్‌రావు కృష్ణుడి బోధనలు, జీవిత విశేషాలను చిన్నారులకు వివరించారు.

పాఠశాల డైరెక్టర్ నీలిమ, నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావుతో పాటు ప్రిన్సిపాల్ టి. గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక

శుక్రవారం 4, సెప్టెంబర్, 2026

# మడకం నాగేశ్వరావు కుటుంబానికి అండగా ఉంటాం.. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

**ఐఈడీ పేలుడులో మృతి చెందిన నాగేశ్వరరావు కుటుంబానికి ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పరామర్శ**

**వెంకటాపురం భద్రాద్రి న్యూస్ సెప్టెంబర్ 3**

ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగూరు గ్రామానికి చెందిన మడకం నాగేశ్వరరావు అడవికి వెళ్లిన సమయంలో బుధవారం జరిగిన విషాదకర ఐఈడీ బాంబు పేలుడు ఘటనలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు గురువారం నూగూరు గ్రామానికి చేరుకుని మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. వెదురు బొంగుల కోసం అడవికి వెళ్లిన సమయంలో ఐఈడీ పేలడంతో నాగేశ్వరరావు మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు వెంకటాపురం మండలంలోని నూగూరుకు చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చి, వారికి మనోధైర్యం కల్పించారు. ఐఈడీ బాంబు పేలుడు ఘటనకు సంబంధించిన వివరాలను



ఎస్పీ కె. తిరుపతిరావు ఎమ్మెల్యేకు వివరించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పీసీసీ చైర్మన్ చిడెం మోహన్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిట్టెం సాయి, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ధనవసేని వెంకటేశ్వర్లు, మన్యం సునీల్, నేతలు బి.



వేణు, కాంగ్రెస్ అధ్యక్షులు చిడెం శివ, శ్రీరాముల రమేష్, నాయకులు గుండుమళ్ల కిరణ్, నూగూరు సర్పంచ్ ఇంద్ర శ్రీనివాసరావు, ఎన్‌పీఎస్ ఆదివాసీ సంఘం నాయకులు కే. నరసింహమూర్తి, ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువత్ నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలపై కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ భగ్గుమాటు

**సాగునీరు ఇవ్వలేని ప్రభుత్వం.. హామీల అమలులో విఫలం**

**రైతు భరోసా, రుణమాఫీ, కౌలు రైతుల హామీలపై బీఆర్ఎస్ నిలదీత**

**చర్ల, సెప్టెంబర్ 3: భద్రాద్రి న్యూస్**

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తీవ్ర అన్యాయం చేసిందని బీఆర్ఎస్ చర్ల మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు గురువారం చర్ల మండలం కొత్తపల్లి గ్రామంలో రైతు సమస్యలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి తాతారావు మాట్లాడుతూ.. రైతు సంక్షేమం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతుల కష్టాలు మరింత పెరిగాయని విమర్శించారు. "రైతు రాజ్యం వస్తుందని ఆశిస్తే రావణ రాజ్యం వచ్చింది" అంటూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టులపై తగిన శ్రద్ధ చూపకపోవడంతో రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. రైతు బీమా విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని, రుణమాఫీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రైతుల కోసం అమలు చేసిన రైతు బీమా వంటి పథకాలు రైతు కుటుంబాలకు భరోసా కల్పించాయని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమ పథకాల అమలుపై నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో రైతులకు సంవత్సరానికి రూ.15 వేల చొప్పున రైతు భరోసా అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర, సన్న వడ్లకు రూ.500 బోనస్, కౌలు రైతులకు రైతు భరోసా, రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామని ఇచ్చిన హామీల పరిస్థితిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**ధాన్యం కొనుగోళ్లపై విమర్శలు**

రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సరైన ఏర్పాట్లు చేయడం లేదని తాతారావు ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.



సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి, ఆ తర్వాత నిబంధనల పేరుతో పరిమితులు విధించడం సరికాదని విమర్శించారు.

**యూరియా కోసం రైతుల తిప్పలు**

రాష్ట్రవ్యాప్తంగా యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. పంటల సాగు కీలక దశలో ఉన్న సమయంలో రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించాల్సిన ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరిస్తోందని ఆరోపించారు. "రైతులకు యూరియా కావాలి.. యాప్‌లు కాదు" అంటూ ప్రభుత్వ తీరుపై ఘాటుగా విమర్శించారు. రైతులకు అవసరమైన యూరియాను సకాలంలో, సరిపడా అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతుల భూములను నిషేధిత జాబితాలో చేర్చడంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, అసైన్డ్ భూముల సమస్యలను పరిష్కరించాలని కోరారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కో-కన్వీనర్ అయినవోలు పవన్ కుమార్, కొత్తపల్లి సర్పంచ్ ఉప్పల నాగలక్ష్మి, మొగళ్లపల్లి ఉపసర్పంచ్ ఎడ్ల రామదాసు, నియోజకవర్గ యువజన నాయకులు కాకి అనిల్, పంజా రాజు, మండల నాయకులు సయ్యద్ అజీజ్, బట్ట కొమరయ్య, రాట్నాల శ్రీరామ్మూర్తి, యూత్ అధ్యక్ష, కార్యదర్శులు అంబోజి సతీష్, కుప్పల నిరంజన్, బీసీ సెల్ అధ్యక్షుడు గోరింట్ల వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొంబతీని రాము, యువజన నాయకులు తడికెల బుల్లేబాయ్, గదెంశెట్టి కిశోర్, కుక్కడపు సాయి, మైప వెంకటేశ్వర్లు, సాంబతో పాటు నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన బీఆర్ఎస్

**మందుపాతర ఘటనలో మృతి చెందిన నాగేశ్వరరావు కుటుంబానికి బీఆర్ఎస్ రూ.10 వేల సాయం.**

**కష్ట కాలంలో బాధ్యత కుటుంబానికి అండగా నిలిచిన బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప రాంబాబు**

**వెంకటాపురం,భద్రాద్రి న్యూస్ సెప్టెంబర్ 3,**

ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని మందుపాతర పేలుడు ఘటనలో మృతి చెందిన మడకం నాగేశ్వరరావు కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచింది. గురువారం మృతదేహం స్వగ్రామానికి చేరుకున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప రాంబాబు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని తెలిపారు. మందుపాతర ఘటన ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. ప్రీ జోన్‌గా



ప్రకటించినప్పటికీ ఇలాంటి ఘటనలు జరగడం ఏమిటని ప్రశ్నించారు. ఇకనైనా ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదుంబా శ్రీనివాసరావు, కొండపర్తి నాని, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ శ్రీనగర్ లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 3( భద్రాద్రిన్యూస్ ):**

స్థానిక శ్రీనగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ స్కూల్‌లో "శ్రీకృష్ణ జన్మాష్టమి" సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషాధారణలో విచ్చేసి వారి ఆటపాటలు కేరింతలతో అందరి మనసులను మైమరిపిస్తూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని ముద్దు బాలకృష్ణుడి జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో దేవదేవుడైన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో విద్యార్థినులు విద్యార్థులు గోపికలు, బాల కృష్ణుల వేషాధారణలో విచ్చేసి అందరిని ఆకట్టుకొని బాల కృష్ణుల అల్లరులతో అబ్బుర పరుస్తూ గోపికలు ఉట్టి లాగుతుండగా బాల కృష్ణులు ఉట్టిని కొట్టి అందరిని ఆనందతన్మయత్వం చెందిస్తూ ఆ దేవదేవుని వేడుకను ఘనంగా ఎంతో భక్తి శ్రద్ధలతో సాంప్రదాయబద్ధంగా నిర్వహించడం జరిగినది. పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్ రావు గారు ఈ కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడుతూ చిన్నికృష్ణుల, గోపికల వేషాధారణలో వచ్చి అందరిని ఆనందపరిచిన విద్యార్థి,విద్యార్థులను అభినందిస్తూ సుఖసంతోషాలతో మంచి విద్యాబుద్ధులు కలగాలని ఆశీర్వదించారు.

స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో విద్య, వినయం, క్రమశిక్షణతో పాటు భారతీయ సంస్కృతి సాంప్రదాయలలోని అద్భుతమైన విలువలను విద్యార్థి దశ నుంచే అందిస్తామని తెలియజేస్తూ విద్యార్థులను బాలకృష్ణుల, గోపికల వేషాధారణలను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను అభినందిస్తూ విద్యార్థులకు శ్రీకృష్ణ భగవానుని అంత అల్లరి, తెలివి, సమయస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు ఆ భగవంతుడు ఇవ్వాలని కోరుతూ అందరికి శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయాలలో భాగమైన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో పాల్గొన్న చిన్నారులను, ఉపాధ్యాయులను అభినందిస్తూ బాల కృష్ణుని వేషాధారణలలో ముద్దు ముద్దు మాటలతో, అల్లరులతో విచ్చేసి ఆబాలగోపాలాన్ని ఆనందపరిచిన మీరు విజ్ఞానులుగా తీర్చిదిద్దబడాలని ఆ భగవంతుని ఆశీర్వాదం అందరికి ఉండాలని కోరుతూ అందరికి శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేసారు.

# అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపించాలి

**కమర్తపు మురళి గ్లోబల్ ప్రచారం మానుకోవాలి**
**మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్**




ఖమ్మం ప్రతినిధి , సెప్టెంబర్ 3( భద్రాద్రిన్యూస్) :- ఖమ్మం నగరం 36వ డివిజన్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై కాంగ్రెస్ నాయకులు కమర్తపు అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఇప్పటికైనా త్రీ టౌన్ పై అతను చేస్తున్న గ్లోబల్ ప్రచారం గత కొద్దిరోజులుగా కమర్తపు మురళి పొట్టి శ్రీరామ రోడ్డు, డివిజన్ అభివృద్ధిపై చేసిన వ్యాఖ్యలకు మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ స్పందించారు. తమ డివిజన్ పరిధిలో రోడ్లు, కాలువలు, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల పరిస్థితి అధ్వానంగా ఉందని ఆయన ఆరోపించారు.

పొట్టి శ్రీరామ రోడ్డు విస్తరణ కోసం కమిషనర్‌ను కలిసి స్థానికులను ఒప్పించింది నేను శివాలయం దగ్గర నుండి హర్కార బావి దాదాపుగా 180 ఇల్లు అందరితో మాట్లాడి దాదాపుగా 78 దాక్యుమెంట్లు కమిషనర్ గారికి అందజేయడం జరిగింది తరువాత అధికారులు వచ్చి రోడ్డు విస్తరణకు కొలతలు వేశారని తెలిపారు ఆ తర్వాత వారి స్వార్థం కోసం అక్కడ ఉన్న అధికార పార్టీ నాయకుడు రెండుసార్లు వాళ్లతో మీటింగ్ పెట్టి వారిని పక్కదోవ పట్టించి వారి వెనక ఉండి ఇంటికి ఐదు వేల రూపాయలు తీసుకొని కాలువలు ధ్వంసం చేశారు . కార్పొరేషన్ కాలవల్ని ఎలా ఎలా ప్రైవేట్ వ్యక్తులు ధ్వంసం చేస్తారు అని ఆరోజు పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇవ్వడం కూడా జరిగింది . మా డివిజన్లోని అన్ని ప్రాంతాల్లో ప్రాంతంలోని కాలువలు మున్సిపాలిటీకి సంబంధించినవేనని, ప్రైవేటు వ్యక్తులు వాటిని ఆక్రమిస్తే చర్యలు తీసుకోవాలని కోరారు. స్మార్ట్ డ్రైనేజీ పేరుతో ఏడాది క్రితం శిలాఫలకం ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటి వరకు పనులు ముందుకు సాగలేదన్నారు. 2025 ఆగస్టు 14న మంత్రి శంకుస్థాపన చేసిన కాలువ పనులు కూడా పూర్తికాలేదని, రైల్వే శాఖ నుంచి రూ.2 కోట్ల నిధులు వచ్చినా ఫలితం కనిపించడం లేదని విమర్శించారు.

బ్రహ్మంగారి గుడి సమీపంలోని రోడ్డు పరిస్థితి, ఆంధ్రా బ్యాంకు నుంచి వైన్ షాపు వరకు రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాల లేమిపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వీధి దీపాల కోసం పలుమార్లు కోరినా స్పందన లేదని, 60 స్తంభాల ఏర్పాటుకు కమిషనర్‌కు లేఖ ఇచ్చినా ఎస్టిమేట్ దశలోనే పనులు నిలిచిపోయాయని తెలిపారు.

**వరద సాయం అందలేదని ఆరోపణ**

ఎస్‌పార్క్, పీసీకే తోట ప్రాంతాల్లో మధ్యతరగతి కుటుంబాలు అధికంగా నివసిస్తున్నాయని, వరద సాయం కోసం 168 మంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఒక్క చెక్కు కూడా రాలేదని రామ్మోహన్ ఆరోపించారు. గతంలో మంత్రి అజయ్‌కుమార్ హయాంలో గాంధీచౌక్ నుంచి ఎంఆర్వో కార్యాలయం మీదుగా నయాబజార్ వరకు యూడీఎఫ్ నిధులతో రోడ్లు అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. అలాగే

మా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో. 23 లక్షల లీటర్ల సామర్థ్యం ఖమ్మం లో బాహుబలి వాటర్ ట్యాంక్ నిర్మాణం జరిగిందన్నారు. పిల్లి చిన్నట్టు తోట, పీసీకే తోట ప్రాంతాల్లో రూ.90 లక్షలతో రోడ్లు, కాలువల పనులకు అనుమతులు తీసుకొచ్చినట్లు తెలిపారు.

**వ్యక్తిగత విమర్శలు సరికాదు**

మురళి వ్యాఖ్యలపై స్పందిస్తూ ముందుగా డివిజన్ పరిస్థితి, గతంలో జరిగిన అభివృద్ధి గురించి తెలుసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రి పక్కన ఉండి రెండుసార్లు పట్టణ అధ్యక్షుడిగా పనిచేసిన వారు ఇప్పుడు అభివృద్ధిపై మాట్లాడటం సరికాదన్నారు. పార్టీ పరంగా ఎవరికి ఏ అభిప్రాయం ఉన్నా అభ్యంతరం లేదని, అయితే వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన విధంగా స్పందిస్తానని హెచ్చరించారు.

గాంధీచౌక్ ఖమ్మం నగరానికి గుండెకాయ వంటిదని, అలాంటి ప్రధాన ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలు ఉండటం బాధాకరమన్నారు. తమ ప్రాంత ప్రజలు చీకట్లో జీవిస్తున్నారని, కనీసం వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా అభివృద్ధి జరిగిందని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు.

మైనారిటీ సోదరులు తమ స్థలాలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని చెప్పినప్పుడు వారిని కూర్చోబెట్టి సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వెనుక దాబాల బజార్ రోడ్డులోని వాసవి గార్డెన్ నుంచి ముందున్న ప్రాంతం వరకు సరైన రోడ్లు, తారు, వీధి దీపాలు లేవని తెలిపారు.

**ఇందిరమ్మ చీరల పంపిణీపై ఫిర్యాదు**

ఇతర డివిజన్లలో ఇందిరమ్మ చీరల పంపిణీ జరుగుతున్నప్పటికీ తమ డివిజన్‌లో నిలిపివేయడంతో గ్రీవెన్స్ డే సందర్భంగా సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానన్నారు. జూబ్లీ క్లబ్‌లో చీరలను నిల్వ ఉంచిన విషయం ఫొటోలతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే యూనిట్ ప్రారంభించి పంపిణీ చేయాలని ఆదేశించినట్లు మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ తెలిపారు.

## హార్వెస్ట్ ప్రైమరీ పాఠశాలల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**చిన్నారుల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా వేడుకలు**
**విద్యార్థులకు శ్రీకృష్ణుడి జీవిత విశేషాలను వివరించిన యాజమాన్యం**







**ఖమ్మం ప్రతినిధి , సెప్టెంబర్ 3 (భద్రాద్రి న్యూస్):-**

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని ఖమ్మంలోని హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో హార్వెస్ట్ ప్రైమరీ పాఠశాలల్లో చిన్నారులతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పి. రవిమోహన్ ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అద్యంతం పండుగ వాతావరణం తలపించేలా పాఠశాలలను వివిధ రకాల పూలమాలలతో అలంకరించి వేడుకలకు శ్రీకారం చుట్టారు. శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు అందరినీ ఆకట్టుకున్నారు. శ్రీకృష్ణుడి వేణునాదం, బాల్య విశేషాలు, గోపికలతో అల్లరి తదితర అంశాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉట్టి కొట్టడం వంటి కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీకృష్ణుడి జీవిత విశేషాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారులు పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాంప్రదాయ వేషధారణతో పాటు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. పార్వతి తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రెజోనెన్స్ శ్రీనివాస నగర్ స్కూల్‌లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



**ఖమ్మం ప్రతినిధ ,సెప్టెంబర్ 3 (భద్రాద్రిన్యూస్ ):-**

ఖమ్మం శ్రీనివాస నగర్ లో రెజోనెన్స్ పాఠశాలలో శ్రీ కృష్ణజన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులందరూ గోపికలుగా, కృష్ణుని వేషధారణలో చాల అద్భుతంగా నాట్యం చేస్తూ శ్రీ కృష్ణుడిఆట, పాటలతో గోపికలతో ఎంతో సంబరంగా ఉట్టి కొడుతూ వేడుకని ఎంతో చక్కగా నిర్వహించడం జరిగింది. ఈ గోకులాష్టమి వేడుకకు పాఠశాల డైరెక్టర్ ఆర్.వినోగేంద్ర కుమార్, నీలిమ ముఖ్య అతిథులుగా పాల్గొని ఈ కార్యక్రమాన్నివిద్యార్థుల చేత ఎంతో శ్రద్ధగా నిర్వహించటం జరిగింది. ఈ వేడుకను ఉద్దేశించి మాట్లాడుతూ ఎంతో విలువైన సందేశాన్ని విద్యార్థులకు అందించారు. ప్రస్తుతం మనం నడుస్తున్నది కలియుగం. అన్ని యుగాలలో శ్రీ మహావిష్ణువు ఒక్కో అవతారాలలో ఉద్భవించటం జరిగింది. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడిగా అవతరించి ధర్మాన్ని నిలబెట్టారు. భాగవత మహాభారతానికి ముఖ్యమైన పాత్ర వహించి పాండవులకు ముందుండి కురుక్షేత్రంలో యుద్ధం చేయించి ధర్మాన్ని కాపాడిన గొప్ప వ్యక్తి . మానవ అవతారంలో అధర్మాన్ని విడి మానవ సేవే మాధవ సేవగా భావించాలని తెలియజేస్తూ ప్రతి మనిషి పుట్టుకకు కారణం0ఉంటుందని ధర్మో రక్షతి రక్షితః ధర్మాన్ని మనం కాపాడితే అదే ధర్మం మనల్ని కాపాడుతుందని తెలియజేసారు. నీలిమ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సంస్కృతి సాం0ప్రదాయాల్ని పాటించాలని మంచి నడవడిక మహా మనిషిగా, జ్ఞానిగ నిలబడడానికి ఎన్నో ఉత్తమ కథలుగా తెలియజేసారు. కాబట్టి ప్రతి విద్యార్థి ఎంతో పట్టుదలతో క్రమశిక్షణతో చదువుకుంటూ ధర్మ మార్గంలో పయనిస్తూ, మంచి నీ చేస్తూ, మంచిని బోధిస్తూ ఎంతో ఉన్నతమైన శిఖరాలని అధిరోహించాలన్న సందేశాన్ని, డైరెక్టర్ కుమార్ విద్యార్థులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు మరియు పిల్లల తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఎంతో సంబరంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకను ఘనంగా నిర్వహించారు.

# కృష్ణయ్య లీలలతో కళకళలాడిన త్రివేణి

**శ్రీకృష్ణ జన్మాష్టమి ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహణ**
**ఖమ్మం ప్రతినిధి , సెప్టెంబర్ 3 (భద్రాద్రిన్యూస్ ):**



శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని త్రివేణి టాలెంట్ స్కూల్, ఖమ్మం శాఖలో ముందస్తు వేడుకలను భక్తిశ్రద్ధలు, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, శ్రీకృష్ణుడి బోధనల పట్ల అవగాహన కల్పించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధమ్మ, గోపికల వేషధారణలో అలరించారు. చిన్నారుల మురళీధర రూపాలు, నృత్య ప్రదర్శనలు, కృష్ణుడి లీలలను ప్రతిబింబించే కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు భక్తి గీతాలు, కృష్ణుని నామస్మరణతో వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఉట్టి కొట్టే కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు ఆనందోత్సాహాలతో పాల్గొని కృష్ణుడి బాల్య లీలలను గుర్తుచేశారు. పాఠశాల ప్రాంగణం చిన్నారుల కృష్ణవేషాలతో, రంగురంగుల అలంకరణలతో సందడిగా మారింది. డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ, పండుగల ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను పరిచయం చేయడం ఎంతో ముఖ్యమని అన్నారు. శ్రీకృష్ణుడి జీవితం నుంచి ధైర్యం, ధర్మం, కర్తవ్యనిష్ఠ వంటి సుగుణాలను విద్యార్థులు అలవరచుకోవాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, శ్రీకృష్ణ జన్మాష్టమి చిన్నారుల్లో ఆనందాన్ని నింపే పండుగ మాత్రమే కాకుండా, ధర్మం, సత్యం, ప్రేమ, స్నేహం వంటి విలువలను తెలియజేసే పర్వదినమని అన్నారు. విద్యార్థులు శ్రీకృష్ణుడి బోధనలను స్ఫూర్తిగా తీసుకుని మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ,వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి ముందస్తు వేడుకలు భక్తి, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా కొనసాగాయి.